క్లుప్తంగా

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



పాయకాపురం(విజయవాడరూరల్): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ అన్నారు. బుధవారం మే డే సందర్భంగా పాయకాపురంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మున్సిపల్ పార్క్, వాకింగ్ ట్రాక్‌ను స్పందన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సందర్శించారు. వాకర్స్ క్లబ్ తరపున సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మజ్జిగ పంపిణీ, చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో స్పందన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇ.కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి వైకే శాస్త్రి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి సీఎం జగన్




మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్మిక పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు నిరుపమానమని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో బుధవారం కార్మిక దినోత్సవం పురస్కరించుకుని కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్మికుల సంక్షేమానికి జగనన్న అందించిన సేవలను వివరించారు. కార్మికుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా శ్రమిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారాల్లో ప్రోత్సహించడమే లక్ష్యం




గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలను వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆర్కే ఫౌండేషన్ పనిచేస్తోందని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఉమా నవీన అన్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులోని ఎస్ కన్వెన్షన్‌లో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి, వ్యాపారాల్లో రాణించేందుకు మహిళలకు ముద్రా రుణాలు మంజూరు చేయించడం, సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ గతంలో అనేక రకాలైన సేవ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ మానవాభివృద్ధి జరగాలంటే మహిళాశక్తి పెంపొందాలని పేర్కొన్నారు. సదస్సులో రోటరీ క్లబ్ రామరావు, యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కృష్ణారావు, జన శిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 61వ డివిజన్‌లో బుధవారం గాళ్ల వెంకయ్య నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, కోఆర్డినేటర్ నాలం బాబు, అనిల్‌బాబు, మాలకొండయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దేవీనగర్ ట్రెండ్‌సెట్‌లో బుధవారం మాజీ డిప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ మేనిఫెస్టో ఓ చిత్తు కాగితం

- నగం పథకాలు కాపీ కొట్టినవే
- 23వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



గవర్నర్‌పేటలోని అపార్ట్‌మెంట్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు చిత్తు కాగితంగా భావిస్తున్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 23వ డివిజన్ పరిధిలోని గవర్నర్‌పేటలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గవర్నర్‌పేటలోని అపార్ట్‌మెంట్స్, వ్యాపార సముదాయాలు, దుకాణాలు, వర్క్‌షాపులన్నీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావిస్తున్న ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను చిత్తు కాగితం కంటే హీనంగా చూస్తున్నారన్నారు. 2014 టీడీపీ మేనిఫెస్టోకి ఇప్పుడు విడుదల చేసిన మేనిఫెస్టోకి పెద్దగా తేడా లేదన్నారు. నగం పథకాలు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో నుంచి కాపీ కొట్టారన్నారు. 2014లో ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానన్న చంద్రబాబు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. మళ్లీ అవే పథకాలు పెట్టి ప్రజలను మోసం చేయాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రజలు ఆ మేనిఫెస్టోను చెత్త బుట్టలో వేస్తున్నారని, జూన్ 4న తర్వాత ఆ రెండు పార్టీలను కూడా చెత్తబుట్టలో వేయడం ఖాయమని పేర్కొన్నారు.

సెంట్రల్‌లో భారీ మెజార్టీ రాబోతుంది..

గవర్నర్‌పేట పూర్తిగా కమర్షియల్ ప్రాంతమని, ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరిని కలిసి ఓట్లు అభ్యర్థించామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే విజయవాడ నగరం అభివృద్ధి చెందుతుందని వ్యాపారులంతా భావిస్తున్నారని పేర్కొన్నారు. తమ వ్యాపారాలు ప్రశాంతంగా జరగాలన్న, విజయవాడ అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రం మంచిగా ఉండాలన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని స్థానికులు చెబుతుంటే సంతోషంగా ఉందన్నారు. డివిజన్‌లోనూ, నియోజకవర్గంలోనూ భారీ మెజార్టీ రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

జనసేనకు గుర్తింపు లేదు.. గుర్తు లేదు..

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చంద్రబాబుకు బానిసలా పనిచేస్తున్నాడని వెలంపల్లి ఆరోపించారు. పవన్ జీవితమంతా చంద్రబాబును మోసేందుకు అంకితం చేశారన్నారు. జనసేన పార్టీ సింబల్ కూడా ఇప్పుడు ఆయన దగ్గర లేదన్నారు. ఆయనను నమ్ముకుని పదేళ్లు పార్టీ జెండా మోసిన కార్యకర్తలను మోసం చేశాడన్నారు. పార్టీ జెండాను చంద్రబాబుకు తాకట్టుపెట్టారని, గ్లాసును అందరికీ ఇచ్చేశారని ఎద్దేవా చేశారు. అటువంటి వ్యక్తి సీఎం జగన్‌పై తొడలు కొడుతున్నారన్నారు. జనసేనకు గుర్తింపు లేదని, చివరికి గుర్తు కూడా లేకుండా పోయిందని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ ఆత్మకూరు సురేష్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు విక్కీ, రాజేష్, అంజి బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

62వ డివిజన్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్ సుందరయ్య నగర్‌లో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు



62వ డివిజన్‌లో ఫ్యానుగుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి

వెళ్లి ఓట్లు అభ్యర్థించి మీ ఆశీస్సులు అందించాలని కోరారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్(నాని)ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్, జిల్లా కార్యదర్శి మేడా రమేష్, రామిరెడ్డి, బొర బుజ్జి, మస్తాన్, డివిజన్ ఇన్‌చార్జి మస్తాన్‌వలీ, రమేష్, మహేష్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్‌మీరా, మహిళా విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీ వేము హైమావతి, సావిత్రి, రాధ, సుబాన్ పాల్గొన్నారు.

రైల్వే గ్రూప్-డీ ఉద్యోగుల పనితీరు భేష్



రైల్వే గ్రూప్-డీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న డాక్టర్ వర్షపాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ఇండియన్ రైల్వేలో గ్రూప్-డీ ఉద్యోగుల పనితీరు అభినందనీయమని సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు డాక్టర్ వర్షాపాటిల్ అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం(మేడే)ను బుధవారం రైల్వే ఆస్పత్రి వద్ద ఉన్న ఈ-వరల్డ్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వర్షాపాటిల్ మాట్లాడుతూ ఇండియన్ రైల్వేకి గ్రూప్-డీ ఉద్యోగులు వెన్నెముక లాంటి వారన్నారు. వారే రైల్వేకి నిజమైన హీరోలన్నారు. వారి కృషి, నైపుణ్యంతో ఇండియన్ రైల్వే ముందుకు దూసుకుపోతోందన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 12 మంది గ్రూప్-డీ మహిళ ఉద్యోగులను సత్కరించి వారికి ప్రశంస పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సంయుక్త కార్యదర్శి వాసంతిక, జాక్ అండ్ జిల్ స్కూల్ కార్యదర్శి శ్రీరమ్య పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో వేసవి ఏర్పాట్లు



భక్తులకు మజ్జిగ పంపిణీ



మూగజీవాల కోసం తాగునీటి సదుపాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పెరుగుతున్న ఎండలతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులు నడుచుకుంటూ వచ్చే కనకదుర్గనగర్ మహా మండపం మార్గంలో పీచుతో ఏర్పాటు చేసిన కార్పెట్లు ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. ఇక అమ్మవారి ఆలయంలో చలువ పందిళ్లు, ఓం టర్నింగ్ మొదలు ఆలయం వరకు పలు చోట్ల మంచినీటి సదుపాయాన్ని కల్పించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మంచినీటి చలివేంద్రాలలో తాగునీటిని అందిస్తుండగా, మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. భక్తులతో పాటు ఇంద్రకీలాద్రి కొండపై ఉండే మూగజీవాలకు మంచినీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈఓ కేఎస్ రామరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పలు చోట్ల కోతులకు, పావురాల కోసం ప్లాస్టిక్ గిన్నెలను ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తున్నారు.

సీఎం జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



26వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే విష్ణు



29వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో మంచుకొండ చక్రవర్తి, కాజ రఘునాథం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 26వ డివిజన్ రైవస్ కాలువగట్టు ప్రాంతంలో బుధవారం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి అంగిరేకుల గొల్లభామతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోని వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక అధికార దాహంతో కూటమి కట్టి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు సిద్ధం అయ్యారని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి కూటమికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు కే నాగాంజనేయులు, పీ ప్రసాద్ పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో సిద్ధం శీనన్న కమిటీ ఆధ్వర్యాన బుధవారం గులాబీతోటలో గడప గడపకు వెళ్లి బొట్టు పెట్టి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను గెలిపించాలని కోరారు. కమిటీ సభ్యులు కురిటి శివ, యర్రంశెట్టి శ్రీను, శీలం భవానీరెడ్డి, కనకలింగేశ్వరరావు, కుమార్, శ్రీధర్, రవివర్మ పాల్గొన్నారు.

29వ డివిజన్‌లో..

29వ డివిజన్ మధురానగర్‌లో మామయ్యల గెలుపు కాంక్షిస్తూ వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి, కేశినేని నాని అల్లుడు కాజ రఘునాథం స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, మేనిఫెస్టో వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కొండలరావు, కృష్ణవేణి, అక్బర్, గోవిందు, నాగమణి, పూర్ణిమ, వాసు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 59వ డివిజన్‌లోని సింగ్‌నగర్ లూనాసెంటర్, ఇమ్మానుయేల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి రోడ్డు, బూదాల ఆదాం కల్యాణమండపం రోడ్లలో బుధవారం వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నాని అల్లుళ్లు మంచుకొండ చక్రవర్తి, కాజా రఘునాథం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వెలంపల్లి కుమార్తె సాయి అశ్వితతో కలిసి ఓట్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, నందెపు సురేష్, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, చిన్నా, శ్రీను, కృష్ణ, షేక్ అమీత్, రాజు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో మేడే వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్‌టీఎస్ రోడ్డులో బుధవారం బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన మేడే వేడుకలు జరిగాయి. వాకర్స్‌క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని వివరించారు. అనంతరం స్పందన వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ ఇ.కృష్ణప్రసాద్, మాతృదేవోభవ వృద్ధుల ఆశ్రమం చైర్మన్ దుర్గ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి కే రాము, కోశాధికారి జీ ఏడుకొండలు, వీ గోకర్ణేశ్వరరావు, డాక్టర్ నాగమల్లేశ్వరి, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం సామాజిక అంశాల సమాహారం



విజయవాడకల్చరల్: కవిత్వం సామాజిక అంశాల సమాహారమని సాహితీవేత్త ఎస్.వేణుగోపాల్ అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా సాహితీ మిత్రులు ప్రచురించిన కవిత 2023, లెనిన్ కావ్యం (తెలుగు అనువాదం)ఆవిష్కరణ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో బుధవారం నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండాలని కవిత్వం ప్రజల గుండె చప్పుడు నుంచి లావాలా రావాలని సమాజాన్ని మార్చే శక్తి కవిత్వానికే ఉంటుందన్నారు. కవిత 2023 సంకలనాన్ని బాలాంత్రపు ప్రసూన, లెనిన్ కావ్యాలన్ని అద్దేపల్లి ప్రభు ఆవిష్కరించారు. కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ సాహితీ మిత్రులు 23 సంవత్సరాలుగా ప్రతి ఏటా మే ఒకటోతేదీన క్రమం తప్పకుండా కవితా సంపుటిని ప్రచురిస్తోందని తెలిపారు. కవి అనిల్ డ్యాని సభను ప్రారంభించారు. కవిత 2023 సంకలనంలోని కవులు స్వీయ కవితాగానం చేశారు. శ్రీరాం పుష్పాల నిర్వహించారు. విశ్వేశ్వరరావు, పలువురు సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద గీతాలు, నృత్యాలు



జానపద గీతాలకు నృత్యాలు చేస్తున్న చిన్నారులు

విజయవాడకల్చరల్: దామోదర జానపదం- మామ్ ట్రస్ట్ ఆధ్వర్యాన కార్మిక దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన జానపద గీతాలు, నృత్య కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమాలను మామ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాంతి వాసుదేవరావ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జానపదం జనపదమని తెలిపారు. శ్రామిక జీవనంలోనే శక్తి దాగి ఉంటుందన్నారు. అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా అనేక మంది గాయకులను పరిచయం చేసినట్లు తెలిపారు. కవులు, గాయకులు మాతృభాషా వికాసానికి కృషి చేయాలని సూచించారు. లలిత, కుసుమాంజలి, సుశీల, రమణ, తేజ, మనస్విని, చందు, పాదుషా, దివ్యశ్రీ, హిమశ్రీ, సహస్రసాహితి, దివ్యలత పలు జానపద గీతాలను ఆలపించారు. నెలిబండ్ల బాలస్వామి, కోట్ల శివశంకరరావు, వేద గంగోత్రి, వరప్రసాద్, అంబటి మధుమోహన కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

ఆర్‌యూబీతో సెంట్రల్ రూపురేఖలు మారతాయి

- అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రూ. 22 కోట్లతో పనులు పూర్తి
- ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్ ఆర్‌యూబీ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీతో సెంట్రల్ నియోజకవర్గ రూపురేఖలు మారడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక మధురానగర్ ఆర్‌యూబీని బుధవారం స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, శర్వాణీమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల్లోపు ఆర్‌యూబీని అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు. కోవిడ్, సాంకేతిక కారణాలతో ఆర్‌యూబీ పనుల్లో జాప్యం జరిగినప్పటికీ నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రూ. 22 కోట్లతో పనులు పూర్తిచేశామని తెలిపారు. అధికారంలో ఉండగా ఏమీ చేయని టీడీపీ నేతలు చేతల ప్రభుత్వంపై రాళ్లు వేసేందుకు మాత్రం ఉంటారని దుయ్యబట్టారు. ఆర్‌యూబీ వద్ద వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా మోటార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే సర్వీసు రోడ్డు ఆర్‌యూబీ సుందరీకరణ పనులు త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. దేవీనగర్ వద్ద ఆర్‌ఓబీకి ప్రతిపాదనలు సిద్ధం చేశామని రాబోయే ఐదేళ్లలో దేవీనగర్ వద్ద ఆర్‌ఓబీ నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దేవీనగర్‌లో ఆర్‌ఓబీ నిర్మించడం వల్ల నున్న వైపు నుంచి వచ్చే వారు నేరుగా మధురానగర్ ఆర్‌యూబీ, అల్లూరి సీతారామరాజు వంతెన, విశాలాంధ్ర రోడ్డు, పశువుల హాస్పిటల్ మీదుగా వారధికి సులభంగా చేరుకోవచ్చని అన్నారు. దీని వల్ల నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని, వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, శర్వాణీమూర్తి మాట్లాడుతూ మధురానగర్‌లో ఆర్‌యూబీ అందుబాటులోకి రావడం వల్ల ఈ చుట్టు పక్కల ప్రాంత రూపు రేఖలు మారిపోతాయని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి కృష్ణవేణి, కంభం కొండలరావు, అక్బర్, శ్రీపతి కిషోర్, గజ్జలకొండ వాసు, దేవినేని సుధాకర్, గోవిందు, బోనం నాగమణి, పూర్ణిమ పాల్గొన్నారు.

సాయిబాబా సేవలు అభినందనీయం

- విలక్షణమైన పనితీరుతో అధికారులను మెప్పించారు
- జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సాయిబాబాను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార, పౌరసంబంధాల శాఖలో ప్రచార సహాయకుడు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా 33 ఏళ్ల పాటు సేవలందించిన ఆగం సాయిబాబా సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఆయన తన విలక్షణమైన పనితీరుతో అధికారులను మెప్పించారని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆడియో విజువల్ సూపర్‌వైజర్ (ఏవీఎస్)గా పనిచేసి మంగళవారం పదవీ విరమణ చేసిన ఆగం సాయిబాబాను కలెక్టర్ ఢిల్లీరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార శాఖలో తనదైన శైలిలో విధులు నిర్వర్తించి.. శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా సాయిబాబా పనిచేశారన్నారు. ఛాయాచిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వంటి విషయాల్లో ఆయన మంచి ప్రతిభ కనబరిచారని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహన్‌రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సహాయకుడు వీవీ ప్రసాద్, జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయం చేయాలి



నేతాజీకాలనీలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిఒక్కరూ చేతనైనంతలో తోటివారికి సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. స్థానిక మధురానగర్ నేతాజీకాలనీలో బుధవారం గజ్జలకొండ వాసు ఆధ్వర్యాన మల్లాది బాలత్రిపుర సుందరమ్మ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని పేదలకు పండ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని మల్లాది బాలత్రిపుర సుందరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పండ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంగితల లక్ష్మీపతి, శర్వాణీమూర్తి, పిల్లి కృష్ణవేణి, కంభం కొండలరావు, దేవినేని సుధాకర్, గోవిందు, నాగమణి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రజకుల అభ్యున్నతి



గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రజకుల సమగ్ర అభివృద్ధి జరిగిందని, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రజకులు అండగా ఉండాలని గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి తిరుపతిరావు అన్నారు. దుర్గాపురంలో బుధవారం గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రజకుల అభివృద్ధి, సంక్షేమానికి జగనన్న చిత్తశుద్ధితో పనిచేశారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రజక సామాజిక భవనాలు, దోబీఘాట్ల పరిరక్షణ, ముఖ్యంగా రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా రజకుల ఆత్మ గౌరవం ఇనుమడింప చేశారని పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి అంజూరి సత్యనారాయణ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఐలమ్మ సామాజిక భవన్, ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు దోబీఘాట్‌లకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. సంఘం సంయుక్త కార్యదర్శి కొండాయగుంట రాము మాట్లాడుతూ రాష్ట్రంలోని రజకులు అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జగనన్న ముఖ్యమంత్రిగా తిరిగి ఎన్నిక అయ్యేవిధంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నగరంలో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్, ఆసిఫ్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో కొండపల్లి వెంకటేశ్వరరావు, సామంతకూరి దుర్గారావు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీపద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, తులసీ దళ అర్చనను ఆలయ అర్చకుడు రామరత్నమాచార్యులు జరిపించారు. పూజలో దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.